# కోస్తాంధ్ర మధ్యతరగతి కుటుంబాలు

- గబ్బిట దుర్గాప్రసాద్, M.A.B.Sc., B.Ed.

ప్రస్తుతం మనం పిలుచుకుంటున్న "ఆంధ్రప్రదేశ్" రాష్ట్రంలో 1) కోస్తాంధ్ర లేక తీరాంధ్ర 2) రాయలసీమ 3) తెలంగాణ అనే మూడు ప్రాంతాలున్నాయి. రాయలసీమ ఒకప్పుడు రతనాల సీమ. నేడు కేవలం రాళ్ళసీమ. తెలంగాణాలో ఖనిజవనరులున్నా, పంటలు దైవాధీనం. కోస్తాంధ్రకు 800 కి.మీ తీరరేఖ వుంది. గోదావరి, కృష్ణా, పెన్నావంటి ప్రసిద్ధ నదులు పారే సీమ. పంట భూములు అధికంగా వుండి, సస్య విప్లవం సాధించి, రాష్ట్రానికి 'అన్నదాత'గా నిలిచిన నేల. ఆరుగాలం కష్టించి పని చేసి, బంగారం పండించే రైతులున్నారు. సారవంతమైన భూములు సస్య కేదారాలు అనిపిస్తాయి. నదీ తీరప్రాంతాలలో నాగరికత సహజంగా అభివృద్ధి చెందుతుంది. కనుక ఈ ప్రాంతం సంస్కృతికి, నాగరికతకు ఆలవాలమైంది. అగ్రహారాలున్న ప్రాంతం కూడా వైదిక సంస్కృతితో బాటు, జైన, బౌద్ధాలు ప్రవర్ధిల్లాయి. కోస్తాంధ్రలోని విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, ఒంగోలు, నెల్లూరు, రాజమండ్రి మొదలైన పట్టణాలు వర్తక వాణిజ్యాలకు, ఉన్నత విద్యకు కేంద్రాలయినాయి. దీనివల్ల పట్నాలకు దగ్గరలో వున్న పల్లెవాసులకు విద్య నేర్వటం సులభమైంది. గ్రామానికి ఒక పాఠశాల వున్న ప్రాంతం. బడి, గుడి లేని వూరే లేదు. రైల్వే కూడళ్ళు, బస్ స్టేషన్‌లు వుండటం వల్ల ప్రయాణాలకు, సరుకు రవాణాకు యిబ్బంది లేదు. అందువల్ల ప్రజలకు సుఖజీవనం కలిగింది. మత్స్య పరిశ్రమ వృద్ధి చెందింది. నదులు జలరవాణాకు సదుపాయంగా వున్నాయి. బంగాళాఖాత సముద్రం ద్వారా విదేశాలకు ఎగుమతులు జరిగాయి. కాలువల ద్వారా నీరు ప్రవహించి ప్రతి రైతు పొలానికి చేరుతోంది. రాజమండ్రి వద్ద ధవళేశ్వరంలో సర్ ఆర్థర్ కాటన్ దొర గోదావరి నదికి ఆనకట్ట కట్టించి, గోదావరి ప్రాంత భూములలో సాలుకు రెండు, మూడు పంటలు పండించటానికి దోహదపడ్డాడు. విజయవాడ వద్ద కృష్ణానదిపై కట్టిన ఆనకట్ట, ఆ తర్వాత వచ్చిన ప్రకాశం బ్యారేజి వల్ల కృష్ణా మండలం మెట్టపైరు సాగుచేసే స్థితి నుంచి బంగారు మాగాణులను సాగుచేసే స్థితి కలిగింది. అన్ని రకాల సౌకర్యాలతో యీ ప్రాంత ప్రజలు సుఖ సంతోషాలతో వున్నారు. తెలంగాణాలోలాగ దొరల పెత్తనం లేదు. రాయలసీమలో లాగ కరువు లేదు. తాము తిని, ఇతరుల కింత పెట్టగల స్తోమత కలిగింది. అందువల్ల విద్య నేర్వడం, ఉద్యోగాలు సాధించటం కోస్తాంధ్రులకు తేలికైంది. అవసరమైతే సుదూర ప్రాంతా లకైనా వెళ్ళి విద్య నేర్చి, ఉద్యోగాలు చేయగల మనస్తత్వం వుంది.

కోస్తాంధ్ర ప్రాంత విస్తీర్ణం 29,906 చ.కి.మీ. జనాభా సుమారు 34,193,868 తూర్పు కనుమల నుండి బంగాళాఖాతం వరకు విస్తరించిన భూమి. ఉత్తరాన ఒరిస్సా, దక్షిణాన తమిళనాడు సరిహద్దు రాష్ట్రాలు. కోస్తాంధ్రలో 9 జిల్లాలున్నాయి. అవి శ్రీకాకుళం విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు. వరి, చెరకు, పొగాకు, అపరాలు, కొబ్బరి యిబ్బడి ముబ్బడిగా పండే ప్రాంతం. అయితే కోస్తాంధ్రలో ఒకేరకమైన సాంస్కృతిక, భాషా ఐక్యత లేదు. ఆరు మాండలికాలు యిక్కడి ప్రజలు మాట్లాడతారు. అనేకమంది రాజుల సుదీర్ఘ పాలన వల్ల కోస్తాంధ్రలో భాషా సంస్కృతులలో వైవిధ్యం గోచరిస్తుంది. "యాసలు" మోసులెత్తి, ఆ ప్రాంతపు ఔన్నత్యాలకు ప్రాతినిధ్యం వహించాయి. అయితే అందరిది ఒకే తెలుగు భాష. కోస్తాంధ్రలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలను కలిపి ఉత్తరాంధ్ర అంటారు. ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలను కలిపి మధ్యాంధ్ర అని, ప్రకాశం, నెల్లూరు జిల్లాలను కలిపి దక్షిణాంధ్ర అని పిలుస్తారు. ఈ ప్రాంతాలలో ఆహారపు అలవాట్లు భిన్నంగానే వుంటాయి. ఉత్తరాంధ్రలో వంశధార, నాగావళి వంటి నదులున్నా, పంటలు వర్షాధారమే. జనుము, గోగు, వేరుశనగ ఎక్కువగా ఉత్తరాంధ్రలో పండుతాయి.

## మధ్య తరగతి కుటుంబాలు

కోస్తాంధ్ర మధ్య తరగతి కుటుంబాలు ఒకప్పుడు వైదిక విద్యకు కేంద్రంగా వున్న ప్రాంతం. క్రమంగా దానిపై అభిరుచి తగ్గి, లౌకిక విద్యలు నేర్చి, ఉద్యోగాలు చేసి కుటుంబ పోషణ చేయటం జరుగుతుంది. 1980 వరకు ఉమ్మడి కుటుంబాలు ఎక్కువగా వుండేవి. ఇప్పుడు మధ్య తరగతి కుటుంబాల విషయం గురించి ఆలోచిద్దాం. మధ్య తరగతి కుటుంబం అంటే సంఘంలో పనిచేసే అట్టడుగు వర్గానికి, ఉన్నత కుటుంబాలకు మధ్య వున్నవారని స్థూలంగా అర్థం చేసుకోవాలి. వీరి సంస్కృతిపై రెండు వర్గాల వారి సంస్కృతి కంటే భిన్నంగా వుంటుంది. మధ్య తరగతి అన్నమాట 1913 నుండి వాడుకలోకి వచ్చిందని అంటారు. సంఘంలో యిదొకస్థాయి అని అనుకోవాలి. స్థిరాస్థి, కొంత బ్యాంక్ బ్యాలన్స్, విద్య, ఉద్యోగం వున్నవారందర్నీ

చిరునామా : 2-405, శివాలయం వీధి, ఉయ్యూరు - 521 165, కృష్ణాజిల్లా, ఆం.ప్ర., Mob : 9989066375, 08676-232797
ఈ-మెయిల్ gabbita.prasad@gmail.com,